అది ఆ దేశానికి ముఖ్య పట్టణం. అందులో ఒక అందమైన ఫైవ్ స్టార్ హోటల్. అది అన్నింటికన్నా ఎంతో ఎత్తైన అంతస్తు. అది ఎ.సి.ది. అందులో మూడు 'గాంధీ టోపీలు' కూర్చుని బ్రాందీ సేవిస్తున్నాయి. అందులో ఒకటోపీ స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరినుంచీ ఓటమి ఎరుగని అధికార పక్షపు ఎదురులేని ఎమ్. పి. మిగతా రెండూ మాజీవి! ఈ రెండూ ఎదురులేని ఎమ్. పి. కి ఇస్తున్న పార్టీ అది!

ప్రతి పార్టీ వెనకా ఏదో ఉన్నట్లే ఈ పార్టీ వెనక కూడా ఒక కిటుకు ఉంది. మరో మూడు నెలల్లో జరగబోయే మధ్యంతర ఎన్నికల్లో పోటీ చెయ్యడానికి అధికార పక్షం టిక్కెట్ల గురించి ఎ. లే. ఎమ్. పి. రికమెండేషన్ కోసం ఇస్తున్న ఖరీదైన పార్టీ అది.

ఒక గంట గడిచింది మత్తుగా.

గది ( వాళ్ళ కళ్ళకు ) తిరుగుతూంది గమ్మత్తుగా.

"తమరు ఈసారైనా మమ్మల్ని కనికరించి పార్టీ టిక్కెట్లిప్పించారంటే మీ మేలు మరువలేము ఈజన్మకి!" నెమ్మదిగా కదిపాడు అందులో ఒక మాజీ ఎమ్. పి.

"ఈ సారి మీరు మంత్రి కావడం ఖాయం. పార్లమెంటులో మీలాంటి సీనియర్ ఎమ్. పి. ఎవడున్నాడుకనక?" మరొక మాజీ ఎమ్. పి. తాళం వేశాడు.

"మీరు మరీ నన్ను పొగిడెయ్యకండి. రేపే పార్టీ ప్రెసిడెంటుతో మాట్లాడతాను. మీ టిక్కెట్ల గురించి భయపడకండి. మీకు తప్పక వస్తాయి కానీ, ఒక్క విషయం. నేను ఈ సారి మంత్రి కావాలంటే మన వెనక కనీసం ఒక పాతిక మంది ఎమ్. పి. లైనా ఉండాలి. ఈ నంబరు వచ్చేటట్లు మీరు ట్రై చెయ్యగలిగితే ..." సూటిగా వారి కళ్ళలోకి చూస్తూ మధ్యలో ఆగారు ఎ. లే. ఎమ్. పి. గారు.

"ఎంతమాట! ఎంతమాట! ఒక పాతిక మందిని సమకూర్చగల సమర్థత మాకుంది లెండి. ఈ విషయంలో మీరు వర్రీ కావడం అనవసరం. మీరు మంత్రికావడం ఈ దేశానికే ఈ గర్వకారణం" అని హామీ ఇచ్చాడు ఆ మాజీ ఎమ్. పి.

ఎ. లే. ఎమ్. పి. గారు నవ్వారు హుందాగా.

మరొక రౌండు పూర్తి అయింది.

"సార్! నా కో సందేహం"-ఆగాడు ఆ మాజీ ఎమ్. పి.

"వూ . అడుగు. సందేహించకు." గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు ఎ. లే. ఎమ్. పి. గారు.

"ఇంతవరకూ మీరు ఓటమి చవిచూడని ఎమ్. పి. కదా? ఇంతకాలం వోటర్ల విశ్వాసం చూరగొనడం నిజంగా చాలా కష్టం. ఇదెలా మీకు సాధ్యమయింది? వాటీజ యువర్ సీక్రెట్ ఆఫ్ సక్సెస్?"

"యూ ఆర్ రైట్!" అని మిగిలిపోయిన ఆఖరి పెగ్గు తాగేసి మొదలు పెట్టారు ఎ. లే. ఎమ్. పి. గారు.

"చూడండి—ఈ రాజకీయం అనేది చాలా గొప్ప వ్యాపారం. మిగతా వ్యాపారస్థులకు, మనకు తేడా ఏమిటంటే వాళ్ళు స్వంతడబ్బు పెట్టుబడి పెట్టి బిజినెస్ చేసి డబ్బు గడిస్తారు. కాని, మనలాంటి రాజకీయ నాయకులు మన బుర్రలు ఉపయోగించి, ప్రజల పెట్టుబడితో వాళ్ళ దగ్గరినుంచే లాభాలు ఆర్జిస్తాము. అండర్‌స్టాండ్? పోతే ఇక్కడ మాయమాటలు, తెలివితేటలు, ప్రజల నాడి తెలుసుకుని మసలుకొనే శక్తియుక్తులు కాస్త ఎక్కువ పాళ్ళలో కావాలి. ఒక చిన్న ఉదాహరణగా క్రిందటి ఎన్నికల ముందు జరిగిన సంఘటన చెపుతాను వినండి ..."

● ● ● ●

అది బీచ్ పక్కగా ఉన్న ఒక మురికివాడ. అక్కడ ఒక ఎలక్షన్ మీటింగు జరుగుతూంది. అందులో ఎమ్. పి. గా పోటీ చేస్తున్న ఒక భారీ కాయంతో బాటు మరి కొంతమంది పారిశ్రామికవేత్తలూ, పుర ప్రముఖులూ కూర్చున్నారు. వారి ముందు గొర్రెల్లాంటి ప్రజలు కూర్చుని ఓపికగా వారు చెప్పేది వింటున్నారు. సిట్టింగ్ ఎమ్. పి. గారు లేచి గొంతు సవరించుకొన్నారు.

"ప్రజలందరికీ కోటి దండాలు! నా గురించి నేను మీ దగ్గర చెప్పుకోవడం పుట్టింటి గొప్పలు మేనమామ దగ్గర చెప్పిన చందంగా ఉంటుంది! మీ గురించి నాకు, నా గురించి మీకు ఇరవై ఏళ్ళుగా తెలుసు. నేను 'దీన, హీనజన మాన ప్రాణ ధన రక్షకు'డ్నని మీరే ఎన్నోసార్లు పొగిడారు!

"మనకు స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళయినా తినడానికి తిండి, కట్టుకోడానికి బట్ట, నివసించడానికి ఇళ్ళు లేవు. ఇది నిజంగా మీ లాంటి వోటర్లకు జరుగుతున్న ఘోరమైన అన్యాయం. నేనా విషయం గురించి తీవ్రమైన ప్రయత్నాలు చేసి మీకు ఇక్కడికి దగ్గరలోనే నూటయాభై పక్కా ఇళ్ళు కట్టించే ఏర్పాట్లు చేశాను. మరి రెండు నెలల్లో ఆ ఇళ్ళు తయారైపోతాయి. అప్పుడు మీరు నరకం లాంటి ఈ మురికి వాడ వదిలి ఆ స్వర్గంలోకి వెళ్ళిపోవచ్చు. మీకు ఎలాంటి శ్రమా కలుగనీయకుండా ఫ్రీగా — అంటే మీ దగ్గర నుండి పైసా కూడా వసూలు చేయకుండా — ఈ ఏర్పాటు నేనే చేశాను. ఇది ఎన్నికల ముందే జరిగి తీరుతుంది. ఇందులో నేను సఫలం కాలేకపోతే నేను ఈ పోటీ నుండి విరమించుకుంటానని సభా ముఖంగా ప్రమాణం చేస్తున్నాను...'

ఆవేశంగా ప్రతిజ్ఞ చేశారు ఎమ్. పి. గారు, సభలో కరతాళ ధ్వనులకు పోటీగా!

ఆ తరవాత ఎమ్. పి. గారి పట్టుదల, కార్యదక్షత, పరిపాలనా పటిమ గురించి ఎంతోమంది మాట్లాడారు. సభ ముగిసింది. అనుకొన్నట్లుగానే రెండు నెలల్లో నూట యాభై 'సి—టైప్' ఇళ్ళు అక్కడికి దగ్గరలోనే కట్టించ

## ది సీక్రెట్ ఆఫ్ సక్సెస్!



-కిల్లాన మోహన్‌బాబు

బడ్డాయి. ఆ మురికి వాడలోని వారంతా కుటుంబాలతో ఖాళీ చేసి ఆ కొత్త క్వార్టర్స్ లోనికి తరలి వెళ్ళారు. ఆ ఎమ్. పి. గారు మూడు లక్షల మెజారిటీతో గెలిచి ఎదురులేని ఎమ్. పి. గా మరొక సారి రుజువు చేసుకున్నారు!

● ● ● ●

"ఇప్పుడేమంటారు?" అన్నారు ఎ. లే. ఎమ్. పి. గారు.

"మీరు గొప్ప దేశభక్తులు! నిజమైన ప్రజా సేవకులు! కాని, ఇదెలా సాధ్యం? ఎంత డబ్బు మీరే ఖర్చుపెట్టి ఇళ్ళు కట్టించారా?" అడిగాడు మాజీ ఎమ్. పి. గారు అమాయకంగా.

"చూడండి. ఇక్కడే మీ తెలివి తేటలు ఉపయోగించాలి. ఆ పేద ప్రజ లుంటున్న మురికి వాడ బీచ్ పక్కగా ఉంది. అది ఒక ఫైవ్ స్టార్ హోటల్‌కి మంచి సైట్! ఆ స్థలం గురించి ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త నన్ను కాంటాక్ట్ చేశాడు. ఆ పేట ఖాళీ చేయిస్తే నాకు పది లక్షలు ఇస్తానన్నాడు. వారికి మరొక చోట చిన్న ఇళ్ళు కట్టిస్తే నేను మురికి వాడ ఖాళీ చేయిస్తానని బేరం పెట్టాను. ఆ మురికి వాడంతా కొంటే వాడికి చాలా డబ్బు ఖర్చు అవుతుంది. అందుకే ఈ డీల్ కి అతను ఒప్పుకున్నాడు. అలాగే ఇళ్ళు అనుకున్న టైముకు కట్టించి ఇచ్చాడు! ఇప్పుడు ఆ మురికి పేట స్థానంలో ఒక అందమైన హోటల్ వెలిసింది. ఆఫ్‌కోర్స్! అందులో నాకూ 'షేర్స్' ఉన్నాయనుకోండి... ఇదీ క్లుప్తంగా నా సీక్రెట్ ఆఫ్ సక్సెస్" అని ముగించారు ఎదురులేని ఎమ్. పి. గారు!

★